జనం పవర్
JANAM POWER

బుధవారం
04 మార్చ్ 2026



# సిద్దిపేటలో చంద్రగ్రహణం.. మూతపడ్డ ఆలయ ద్వారాలు

**సంప్రదాయం ప్రకారం నిలిచిన స్వామివారి దర్శనాలు**

**గ్రహణం వీడిన తర్వాత శుద్ధి చేసి ఆలయాలు పునఃప్రారంభం**

**సిద్దిపేట, మార్చి 3 (జనం పవర్):**

సిద్ధిపేట పట్టణంలో చంద్రగ్రహణం సందర్భంగా సంప్రదాయ ఆచారాలను అనుసరిస్తూ ఆలయాల ముఖద్వారాలను తాత్కాలికంగా మూసివేశారు. గ్రహణ సమయం ప్రారంభం కావడంతోనే ప్రధాన దేవాలయాల్లో సాధారణ దర్శనాలను నిలిపివేశారు. హిందూ సంప్రదాయాల ప్రకారం గ్రహణ కాలాన్ని శుద్ధి లేని సమయంగా భావిస్తారు. అందుకే ఆలయాల్లో నిత్య పూజలు, అర్చనలు, దర్శనాలు ఆపివేసి ద్వారాలు మూసివేయడం ఆనవాయితీగా వస్తోంది. పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, ఉమా పార్థివ కోటి లింగేశ్వర స్వామి ఆలయాలతో పాటు వివిధ దేవాలయాల్లో భక్తులు ముందుగానే దర్శనాలు ముగించుకుని వెళ్లారు. చంద్రగ్రహణం పూర్తిగా ముగిసిన తర్వాత ఆలయాల్లో శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణాలను శుభ్రపరిచి, దేవతా విగ్రహాలకు అభిషేకాలు చేసిన తర్వాతే ద్వారాలు తిరిగి తెరిచారు. గ్రహణం వీడిన తర్వాత ఆలయాలు మళ్లీ భక్తులతో కళకళలాడాయి.



# కలెక్టర్ల సదస్సులో కలెక్టర్ పీ. ప్రావీణ్య

- అభివృద్ధి పనులపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- జిల్లా ప్రగతి నివేదికను సమర్పించిన కలెక్టర్



**హైదరాబాద్/సంగారెడ్డి, మార్చి 3 (జనం పవర్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పీ. ప్రావీణ్య పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. జిల్లాల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు వేగవంతంగా అమలు కావాలని, ప్రజలకు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ప్రతి జిల్లా కలెక్టర్ తమ తమ జిల్లాల ప్రగతి నివేదికలను సమర్పించి, ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లాలో అమలవుతున్న పథకాల స్థితిగతులను కలెక్టర్ పీ. ప్రావీణ్య వివరించినట్లు తెలిసింది.



# సిద్దిపేటలో హోలీపై గ్రహణం నీడ

- అర్ధాంతరంగా ముగిసిన సంబరాలు
- చంద్రగ్రహణం ప్రభావంతో తగ్గిన పండగ ఉత్సాహం
- మధ్యాహ్నం లోపే ముగిసిన రంగుల కేళి

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్ధిపేట జిల్లాలో హోలీ పండగ సందర్భంగా మంగళవారం పట్టణంలో సంబరాలు మొదలయ్యాయి. ఇదే రోజు చంద్రగ్రహణం రావడంతో వేడుకలు గతంలో కంటే తక్కువ స్థాయిలో జరిగాయి. ఉదయం వేళ చిన్నారులు, పాఠశాల విద్యార్థులు, యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. కాలనీలు, వీధులు రంగులతో నిండిపోయాయి. గ్రహణం కారణంగా పెద్దలు, వృద్ధులు బయటకు రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు.


శాస్త్రోక్తంగా గ్రహణ సమయాల్లో బయటకు రావడం నివారించే ఆచారాన్ని అనుసరించిన వారు ఎక్కువగా ఇంట్లోనే ఉండిపోయారు. దీంతో హోలీ ఉత్సవాలు సాధారణ సంవత్సరాలతో పోలిస్తే తక్కువ సమయంలోనే ముగిశాయి. మధ్యాహ్నం కల్లా వేడుకలు అర్ధాంతరంగా ముగిసినట్లు కనిపించింది. కేవలం యువత మాత్రమే పరిమిత స్థాయిలో రంగులాడి సంబరాలను ముగించారు. బుధవారం స్నేహితులు, బంధువులతో కలిసి మరోసారి హోలీ జరుపుకునే అవకాశం ఉందని పట్టణ ప్రజలు చెబుతున్నారు.











# సిద్దిపేట కోమటి చెరువు వద్ద అద్భుతం.. గ్రహణ వేళ ఎర్రని చందమామ

- నెక్లెస్ రోడ్‌లో ఆకాశ వింతను వీక్షించిన నగర వాసులు
- అంగారక వర్ణంలో మెరిసిన చంద్రబింబం.. సెల్ఫీలతో సందడి

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్ధిపేట పట్టణంలోని కోమటి చెరువు నెక్లెస్ రోడ్ పరిధిలో మంగళవారం రాత్రి చంద్రగ్రహణం సందర్భంగా ఆకాశంలో అపూర్వ దృశ్యం ఆవిష్కృతమైంది. నగర వాసులు పెద్ద సంఖ్యలో నెక్లెస్ రోడ్ వద్దకు చేరుకుని ఈ ఖగోళ వింతను ఆసక్తిగా వీక్షించారు. గ్రహణ సమయంలో చంద్రుడు అంగారక వర్ణంతో ప్రకాశవంతంగా మెరిసిపోవడం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. సాధారణంగా కనిపించే తెల్లని చంద్రుడికి భిన్నంగా, ఎర్రటి కాంతితో మెరుస్తూ కనిపించిన ఈ దృశ్యం వీక్షకులకు కనువిందు చేసింది. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు కుటుంబ సమేతంగా వచ్చి ఈ అద్భుతాన్ని ఆస్వాదించారు. చెరువు తీరంలో ఏర్పాటు చేసిన వీక్షణ స్థలాల్లో యువత ఫోటోలు, వీడియోలు తీసుకుంటూ సందడి చేశారు. కొందరు ఈ ఖగోళ మార్పు వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను వివరించగా, మరికొందరు భక్తి భావంతో దర్శించుకున్నారు. ఇంత స్పష్టంగా, ఎర్రటి రంగులో చంద్రుడు కనిపించడం చాలా అరుదని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కోమటి చెరువు తీరం మరోసారి ప్రకృతి సోయగాలకు వేదికగా నిలిచి సిద్దిపేట వాసులకు చిరస్మరణీయ అనుభూతిని అందించింది.



